చాపకింద నీరులా డిఫ్తీరియా !

● ఈ ఏడాది ఫీవర్‌లో ఇప్పటి దాకా 232 కేసులు ● చిన్నారులకు డీపీటీ వ్యాక్సిన్ తప్పనిసరి

గత కొద్దికాలంగా చాపకింద నీరులా డిఫ్తీరియా మళ్లీ విస్తరిస్తోంది. మన కళ్ల ముందే ఆటలు ఆడుతున్న చిన్నారులకు ఉన్నట్టుండి జ్వరం, గొంతువాపు, శ్వాస తీసుకోవడం కష్టంగా మారుతోంది. ఈ మహమ్మారికి టీకా ఉన్నా.. వైద్యారోగ్యశాఖ నిర్లక్ష్యం కారణంగా తిరిగి విజృంభిస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నల్లకుంట: నగరంతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా డిఫ్తీరియా బాధితులు చికిత్సల కోసం నల్లకుంట ఫీవర్ ఆస్పత్రికి వస్తున్నారు. వైద్యులు వీరిని క్లినిక్ డిఫ్తీయా కేసుగా నమోదు చేసి చికిత్సలు అందిస్తున్నారు. వైద్య పరిభాషలో డిఫ్తీరియా(కంఠసర్పి)గా పేర్కొనే ఈ వ్యాధి బారిన పడిన పలువురు చిన్నారులు ప్రస్తుతం నల్లకుంట ఫీవర్ ఆసుపత్రిలో చేరి చికిత్స తీసుకుంటున్నారు. ఈ ఏడాది జనవరిలో 102, ఫిబ్రవరిలో 88 డిఫ్తీరియా కేసులు నమోదు కాగా.. ఈ నెల 16 వరకు 42 కేసులు నమోదయ్యాయంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- జాతీయ ఇమ్యూనైజేషన్ ప్రోగ్రామ్‌లో భాగంగా గర్భిణీలతో పాటు చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలను ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తోంది.
- పోలియో, బీసీజీ, హైపటైటీస్–బి, డీపీటీ వ్యాక్సిన్ అందజేస్తోంది. నగరంలోని అన్ని ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ప్రతీ బుధవారం వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగుతోంది. ఆ తర్వాత ప్రతీ శనివారం ఆరోగ్య కేంద్రాల పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు ఆయా బస్తీలు, పట్టణాలు, గ్రామాల్లో పర్యటించి వ్యాక్సినేషన్‌పై అవగాహన కల్పించాల్సి ఉండగా ఒక్క పోలీయో డే రోజు మినహా ఇతర సందర్భాల్లో అవగాహన కల్పించడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో కొంతమంది తల్లిదండ్రులు ప్రైవేటు క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు.



ఫీవర్‌లో చికిత్స తీసుకుంటున్న బాధితులు

- గతంలో డీపీటీ (డిఫ్తీరియా , ధనుర్వాతం, కోరింత దగ్గు) వ్యాక్సిన్ తీసుకున్న వారు కూడా అనారోగ్యం పాలవుతున్నారు. వ్యాక్సిన్ నిల్వలో సరైన ప్రమాణాలు పాటించకపోవడమే దీనికి కారణమనే విమర్శలున్నాయి.
- వ్యాక్సిన్ వేసిన తర్వాత కూడా పిల్లలకు డిఫ్తీరియా సోకుతుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తం అవుతోంది. డీపీటీ వ్యాక్సిన్‌పై అవగాహన లేక పోవడం, వ్యాక్సిన్‌పై అపోహ కూడా కారణమని తెలుస్తోంది.
- సాధారణంగా చిన్నారుల్లో కనిపించే ఈ వ్యాధి లక్షణాలు ప్రస్తుతం పెద్ద వారిలో కూడా వెలుగు చూస్తున్నాయి. వ్యాధి బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తగా 18 నెలలకు ఓ డోసు, ఐదేళ్లకు మరో డోసు చొప్పున, పదేళ్లకు బూస్టర్ డోస్ డీపీటీ, డీటీ వ్యాక్సిన్ ఇవ్వాలి. ప్రస్తుతం పెంటావాలెంట్ అనే టీకాలో డీపీటీ, హెపటైటిస్–బి, టీటీ వ్యాక్సిన్‌లు ఉన్నాయి. ఇవి పిల్లలకు 6, 10, 14 వారాల వయస్సులో మూడు డోసులు వేయించాల్సి ఉంటుంది.

లక్షణాలు గుర్తించడం ఎలా...

- గొంతువాపుతో పాటు ట్రాన్సిల్స్‌పై పింక్ కలర్ ప్యాచ్ ఏర్పడి రక్తస్రావం అవుతుంది.
- డిఫ్తీరియా బాధితుడు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు తుంపర్ల ద్వారా బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది.
- ముక్కు నుంచి నీరు కారుతుంది. తలనొప్పి వస్తుంది. దగ్గు, జ్వరం, జలుబు ఉంటుంది.
- శ్వాస సరిగ్గా తీసుకోలేకపోవడం, హై టెంపరేచర్‌తో కూడిన జ్వరంతో బాధపడతారు.
- నిర్లక్ష్యం చేస్తే నాడీ వ్యవస్థ, గుండె పనితీరు దెబ్బతిని చనిపోయే ప్రమాదం ఉంది.

సకాలంలో చికిత్స తీసుకోకుంటే ప్రాణానికే ముప్పు..



డిఫ్తీరియా భయంకరమైన అంటువ్యాధి. జాగ్రత్తలు తీసుకోకపోతే ఇతరులకు ఈ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. 'కొరెని బ్యాక్టీరియం' అనే క్రిమి నుంచి చిన్నారులకు ఇది సోకుతుంది. సకాలంలో మందులు తీసుకోకపోతే గుండె, నరాలపై తీవ్ర ఒత్తిడి పెరిగి ప్రాణాలనే తీస్తుంది. కొన్ని సందర్భాల్లో బుల్‌నెక్‌గా మారే ప్రమాదం కూడా ఉంది. దీనికి నివారణగా డీపీటీ, డీటీ టీకాలు వేయించడం ఒక్కటే పరిష్కారం. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ అనిల్‌కుమార్, ప్రొఫెసర్ ఆఫ్ మెడిసిన్, ఫీవర్ ఆసుపత్రి

సీఐటీయూ ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్ష



ఇందిరాపార్కు వద్ద జరిగిన నిరవధిక దీక్షలో ఫెడరేషన్ నేతలు, కార్మికులు

కవాడిగూడ: ట్రాన్స్‌పోర్టు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఎం.వీ.యాక్టు – 2019ను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర రవాణా రంగంలో 20 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని వారి సంక్షేమం కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటుతో న్యాయమైన సమస్యలు పరిష్కరించాలన్నారు. గురువారం ఇందిరాపార్కు వద్ద 'ఆలిండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్, 'గ్రేటర్ హైదరాబాద్ గ్రేటర్ సెంట్రల్ సిటీ కమిటీ' ఆధ్వర్యంలో 48 గంటల పాటు నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ.. దేశ జీడీపీలో 4 శాతం వాటా అందిస్తున్న రవాణా రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. విధి నిర్వహణలో ఏమైనా ప్రమాదాలు జరిగినా, గాయాలపాలైన వారిని ఆదుకునే దిక్కులేక రవాణా రంగ కార్మికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

- అత్యంత కీలకంగా ఉన్న రవాణా రంగ కార్మికులు నిత్యం ప్రమాదకరమైన జీవితాలు గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.
- రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి బోర్డు ఏర్పాటు చేయాలని, కేరళ, తమిళనాడు, బెంగాల్, కర్ణాటక రాష్ట్రాల తరహాలో ట్రాన్స్‌పోర్టు కార్మికులకు ఆక్సిడెంట్ బెనిఫిట్స్, వైద్యసాయం, వారి పిల్లల చదువుకు స్కాలర్‌షిప్‌లవంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు.
- ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ట్రాన్స్‌పోర్ట్ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులు వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.
- కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటర్ వెహికల్ (అమెన్డ్‌మెంట్)యాక్ట్– 2019 ను సవరించాలని డిమాండ్ చేశారు. నగర కార్యదర్శి అజయ్‌బాబు, నాయకులు ఎం.డీ.ఖలీమ్, ఉమేష్ రెడ్డి, సురేష్, మహేష్, జునైద్, ఇమ్రాన్, హనీఫ్, మోయిన్, చాంద్‌పాషా, నాగరాజు, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన వల్లే ధరల పెరుగుదల'



ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ అనిల్‌కుమార్‌యాదవ్

ముషీరాబాద్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అసమర్థ పాలన వల్లే నిత్యావసర సరుకులు, గ్యాస్ ధరలు విపరీతంగా పెరిగాయని ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ ఆరోపించారు. గురువారం ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ హథ్ సే హథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి చేస్తున్న హథ్ సే హథ్ జోడో యాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనయాదవ్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్, లింగం గుప్తా, ఓబీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, గ్రేటర్ కార్యదర్శి ఆర్.ఎల్.రమేష్, మురళీమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని పాదయాత్ర



భోలక్‌పూర్ డివిజన్‌లో దండోరా వేస్తున్న ఎంఎస్‌ఎఫ్, ఎమ్మార్పీఎస్ నేతలు

కవాడిగూడ: పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు సోమశేఖర్ మాదిగ అన్నారు. గురువారం ముషీరాబాద్ నియోజకవర్గంలో భోలక్‌పూర్, ఇందిరానగర్, మహాత్మానగర్ బస్తీల్లో ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఎస్‌పీ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గజ్జల రాజశేఖర్‌మాదిగ ఆధ్వర్యంలో సోమ శేఖర్‌మాదిగ పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని ఇచ్చిన హామీ తొమ్మిదేళ్లు గడిచినా జరగలేదన్నారు. తమ న్యాయపరమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ఓట్ల కోసం బీజేపీ మాదిగ బస్తీలకు వస్తే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

- ఏప్రిల్ 3న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేపట్టే మహాధర్నాకు మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని దండోరా వేస్తూ.. ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మల్లికార్జున్, శ్యామ్, నర్సింగ్‌రావుమాదిగ, రాజు, యాదగిరి, దశరథ్, జీవన్, సురేందర్, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేవైఎం నేత ముద్దారి శివాజీ రిమాండ్

ముషీరాబాద్: బీజేవైఎం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముద్దారి శివాజీని బేగంపేట పోలీసులు అరెస్టు చేశారు. గత 2–3 రోజులుగా టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యంతో ప్రశ్న పత్రాల లీకేజీ వ్యవహారంపై నగరంలో బీజేవైఎం ఆధ్వర్యంలో పలు ఆందోళనల్లో పాల్గొన్న ఆయనపై బేగంపేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాష్ట్ర బీజేవైఎం అధ్యక్షుడు భానుప్రకాష్‌ను అరెస్టు చేసి ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చిన సందర్భంగా శివాజీని తరలిస్తున్న పోలీస్ వ్యాన్‌ను అడ్డుకుని కార్యకర్తలు పోలీసులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో ఆగ్రహంగా ఉన్న పోలీసులు రాంనగర్ డివిజన్‌లోని జెమిని కాలనీలోని తన నివాసం నుంచి బయటకు వెళ్తున్న క్రమంలో పోలీసులు కాపుకాసి శివాజీని అరెస్టు చేసి బేగంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

సామాజిక పరివర్తనపై ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి



కాచిగూడ: సమాజంలో సామాజిక పరివర్తన పైనే ఆర్‌ఎస్‌ఎస్ దృష్టి పెట్టి నిరంతరం పనిచేస్తోందని ఆర్‌ఎస్‌ఎస్ తెలంగాణ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ అన్నారు. గురువారం బర్కత్‌పురాలోని కేశవ నిలయంలో ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హరియానాలో జరిగిన ఆర్‌ఎస్‌ఎస్ అఖిల భారతీయ ప్రతినిధి సభలో తీసుకున్న తీర్మానాలను వెల్లడించారు. సమాజ పునరుజ్జీవన మార్గంలో వచ్చే అన్ని అడ్డంకులను తొలగించేందుకు ఆర్‌ఎస్‌ఎస్ కృషి చేస్తోందన్నారు. పర్యావరణ పరిరక్షణ, దేశభక్తి, గ్రామాల అభివృద్ధి, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిరోధించడమే లక్ష్యంగా పలు కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఎస్ చేపడుతోందన్నారు. చేతివృత్తులను ప్రోత్సహించడం, కుటుంబ విలువలను పెంపొందిచడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ప్రకటించారు.ఆర్‌ఎస్‌ఎస్ క్షేత్ర ప్రచార ప్రముఖ్ నడింపల్లి ఆయుష్ పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్

కాచిగూడ: బీసీ కులాల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్లు ఏర్పాటు చేయాలని బీసీ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. జనాభా ప్రాతిపదికన కార్పొరేషన్‌లకు మండలీలను ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. గురువారం బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించి సబ్సిడీ రుణాలను మంజూరు చేయాలన్నారు. బీసీ కులాల ఫెడరేషన్‌లతో నిమిత్తం లేకుండా అర్హులైన పేదలందరికీ వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని కోరారు. శ్రీకాంత్ వాసు, నిమ్‌కర్ ప్రశాంత్, సాంబశివగౌడ్, శివనాగేశ్వర్‌రావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారం దిశగా బీసీలు అడుగులు వేయాలి



మాట్లాడుతున్న డాక్టర్ దాసు సురేష్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాన్షీరాం స్ఫూర్తితో రాజ్యాధికార దిశగా బీసీలు అడుగులు వేయాలని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసు సురేష్ అన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం బహుజనులంతా చైతన్యంకావాలని పిలుపునిచ్చారు. అడ్డంకులు ఎదురైనా ఉన్నత వర్గాల నుంచి అవమానాలు చవిచూసినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో బహుజన సమాజ పార్టీని స్థాపించి పేదలకు రాజ్యాధికారాన్ని అందించిన మహనీయుడు కాన్షీరాం అని ఆయన బాటలో బహుజనులంతా నడవాలన్నారు. కోర్ కమిటీ సభ్యులు ఆనందం, రాష్ట్ర నాయకులు కుమార్‌గార్గె, కిషోర్, హరిదూడ, అనిల్, రవి పాల్గొన్నారు.

అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతం

కవాడిగూడ: పేద కుటుంబాలకు చెందిన గర్భిణీలకు సామూహిక సీమంతం నిర్వహించడం అభినందనీయమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం కవాడిగూడ డివిజన్ దోమలగూడ బండానగర్‌లో అఫ్సా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు అఫ్సా లాంటి సంస్థలు స్వచ్ఛందంగా ముందుకు రావడాన్ని ఆయన అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం అఫ్సా, అమ్మ ఫౌండేషన్‌లతో కలిసి పేద కుటుంబాలకు చెందిన గర్భిణీలకు సీమంతం చేశారు. మహిళా దినోత్సవం సందర్భంగా వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన మహిళలకు సత్కరించారు. అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అనిల్‌కుమార్, అరుణ, అఫ్సా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రవీణ్ అజారే, సామాజిక కార్యకర్త రమేష్, శ్రావణి, లావణ్య, బీఆర్‌ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్యామ్‌యాదవ్, సాయికృష్ణ, హనుమాన్ దేవాలయ చైర్మన్ రాజశేఖర్‌గౌడ్, రాంచందర్, మాణిక్యంమధు, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తినిచ్చేలా సేవా కార్యక్రమాలు నిర్వహించాలి



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

అంబర్‌పేట: సేవాభావాన్ని పెంపొందించుకునేలా చేపట్టే కార్యక్రమాలకు ఆదరణ ఉంటుందని బాగ్ అంబర్‌పేట కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి అన్నారు. గురువారం మాజీ కార్పొరేటర్ సాంబశివగౌడ్ మాతృమూర్తి లక్ష్మమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా సాయిమధురానగర్‌లో పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కార్పొరేటర్, మాజీ కార్పొరేటర్లు జ్ఞానేశ్వర్‌గౌడ్, వెంకట్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరై పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. కుటుంబ సభ్యులు చంద్రకళ ఉమామహేశ్వరి, అవినాష్‌గౌడ్, యువరాజ్‌గౌడ్, వివిధ పార్టీల నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

రేషన్‌షాప్ తనిఖీ



తనిఖీ చేస్తున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్, తదితరులు

చిక్కడపల్లి: ప్రజలకు లభించే బియ్యం, గోధుమలు మరీ ఇతర వస్తువుల తూకం, నాణ్యత, సరఫరాలో ఎలాంటి అవినీతి జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేషన్‌షాప్ డీలర్లకు గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనీవినయ్‌కుమార్ సూచించారు. గురువారం డివిజన్‌లోని 624 నంబరు రేషన్‌షాప్‌ను ఆమె విజిలెన్స్ కమిటీ సభ్యురాలు హోదాలో సందర్శించారు. రేషన్‌షాప్ ద్వారా ప్రజలకు అందుతున్న సరుకుల పంపిణీపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతినెలా సరుకులతో పాటు కేంద్రం అందిస్తున్న గరీబ్‌కల్యాణ్ యోజన పథకం కింద ప్రతి ఒక్కరికీ ఉచితంగా 5 కిలోల బియ్యం అదనంగా అందిస్తున్న పథకంపై వివరాలు సేకరించారు. పౌరసరఫరాల శాఖ సీనియర్, జూనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్‌లు విద్యాసాగర్, రాకేష్, డీలర్ సూర్యనారాయణ, బీజేపీ నాయకులు వినయ్, రత్నసాయిచంద్, శ్రీకాంత్, సురేందర్, నర్సింహ తదితరులున్నారు.

శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయండి

కాచిగూడ/అంబర్‌పేట: శ్రీరామనవమి సందర్భంగా భాగ్యనగర్ శ్రీరామనవమి శోభాయాత్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీన అంబర్‌పేట మున్సిపల్ గ్రౌండ్ నుంచి సుల్తాన్‌బజార్‌లోని హనుమాన్ వ్యాయామశాల వరకు నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేయాలని శోభాయాత్ర కమిటీ కన్వీనర్ వెంకట్‌రెడ్డి కోరారు. గురువారం కాచిగూడలోని శ్రీ శ్యామ్‌మందిర్‌లో శోభాయాత్రను విజయవంతం చేయాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. బీజేపీ సీనియర్ నేత కన్నె రమేష్ యాదవ్, బుచ్చిరెడ్డి, సంతోష్‌కుమార్, శేర్‌సాగర్, నర్సింగ్‌యాదవ్, సుభాష్‌పటేల్, కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి,చుక్క జగన్, బుచ్చిరెడ్డి, దత్తు తదితరులున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్.. !

స్థానికుల అప్రమత్తతో తప్పిన ప్రమాదం



నల్లకుంటలో విద్యుత్ స్తంభంపై ఎగిసి పడుతున్న మంటలు పక్కనే డీఆర్‌ఎఫ్ సిబ్బంది

నల్లకుంట: ఓ వైపు అకాల వర్షం, మరోవైపు విద్యుత్ స్తంభంపై ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానిక దుకాణదారులు, బాటసారులు పరుగులు తీశారు. గురువారం సాయంత్రం 3.30 సమయంలో నల్లకుంట ఫీవర్ ఆసుపత్రి చౌరస్తా నుంచి శివానంద్ నగర్‌కు వెళ్లే టర్నింగ్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై రెండు వైర్లు ఒకదానికి ఒకటి తగలడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులు, అగ్నిమాపక, డీఆర్‌ఎఫ్ అధికారులకు సమాచారం అందించారు. స్పందించిన అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేయగా.. డీఆర్‌ఎఫ్ సిబ్బంది సహాయక చర్యలు చేపట్టేందుకు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంట తర్వాత ఘటనా స్థలానికి చేరుకున్న అగ్ని మాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్ సాయంతో మంటలను ఆర్పివేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు విద్యుత్‌శాఖ సిబ్బంది తగిన చర్యలు చేపట్టారు.

ట్రాన్స్ ఫార్మర్‌కు మంటలు వ్యాపించి ఉంటే..

- పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు మంటలు వ్యాపించి ఉంటే ప్రమాద తీవ్రత అధికంగా ఉండేదని, ఈ ఘటన రాత్రివేళ జరిగి ఉంటే సమీపంలోని షాప్‌లకు మంటలు వ్యాపించేవని భారీగా ఆస్తినష్టం వాటిల్లేదని స్థానికులు చెబుతున్నారు.
- కాలం తీరిన విద్యుత్ వైర్లను తొలగించి నాణ్యమైన వైర్లు ఏర్పాటు చేసి షార్ట్ సర్క్యూట్ సమస్యలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

జీవో 58ని వెంటనే అమలు చేయాలి



వ్యవసాయ కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.వెంకటరాములు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జీవో నెంబర్ 58ని వెంటనే అమలు చేసి పేదల గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గడిచిన 75 ఏళ్లుగా పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చి ఆదుకుంటున్నామని ఆర్భాటంగా ప్రకటిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా వాగ్దానాలు ఇవ్వడం ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపరచడం, అనంతరం వాటి గురించి పట్టించుకోకపోవడం పరిపాటిగా మారిందని ఆరోపించారు.

- ఇచ్చిన వాగ్దానాలపైన పేదలు, ప్రజా సంఘాలు పోరాడితేనే కొంతమేర అమలు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. పేద వారికి ఇంటి కల నేరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.
- పెరుగుతున్న భూముల ధరల వల్ల పేదలు కనీసం గజం స్థలాన్ని కూడా కొని ఇంటిని నిర్మించుకునే పరిస్థితుల్లో లేరని ఆవేదన వ్యక్తం చేశారు.
- కోనేరు రంగారావు కమిటీ రిపోర్టు ఆధారంగా ప్రతీ కుటుంబానికి రెండెకరాల భూమిని ఇవ్వొచ్చని ఆ రిపోర్టును బయటకు తీసి అమలు చేయడానికి ప్రభుత్వాలకు చిత్తశుద్ధి లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- ప్రభుత్వ భూములను భూ బ్యాంకుల పేరుతో ధనవంతులు, కార్పొరేట్ శక్తులకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు.
- పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి చేతులు రాకపోగా ఇచ్చిన అసైన్డ్ భూములను కూడా లాక్కోడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు చిత్తశుద్ధితో అణగారిన వార్గాలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు జీవో నెంబర్ 58ను వెంటనే అమలు చేయాలని కోరారు.
- ఈ నెల 17 నుంచి 19వ వరకు ఇళ్ల స్థలాల కేంద్రాల్లో సదస్సులు, మార్చి 20 నుంచి 31 వరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నాలు, ఏప్రిల్ 10 తర్వాత ప్రత్యేక పోరాటాలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, వ్యవసాయ సంఘం రాష్ట్ర నాయకులు నాగయ్య, శోభన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనులు ప్రారంభం



పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్‌లు

అంబర్‌పేట: ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా అభివృద్ధి పనులను పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గురువారం బాగ్‌అంబర్‌పేట డివిజన్ భరత్‌నగర్‌లో రూ.10 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. అనంతరం భరత్‌నగర్‌లో స్థానిక సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ నాయకులు చందు, ఈఎస్.ధనుంజయ, రవీందర్, బీజేపీ నాయకులు అజయ్‌కుమార్, శ్రీనివాస్, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు మాతృవియోగం

నల్లకుంట: నల్లకుంట కార్పొరేటర్ అమృత మాతృమూర్తి, కేసారం మాజీ సర్పంచ్ గిరి యాదమ్మ(85) గురువారం తెల్లవారు జామున అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు కార్పొరేటర్ అమృతకు ఫోన్ ద్వారా సంతాపం తెలియజేశారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు వనం రమేష్, కార్యదర్శి నాయిని బుచ్చిరెడ్డి, ఓబీసీ మోర్చా కార్యదర్శి కిశోర్‌కుమార్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి అజయ్, ఎస్సీ మోర్చా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ కుమార్, బీజేపీ సెంట్రల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ కేజే బాబు, అంబర్‌పేట నియోజక వర్గ కన్వీనర్ శ్యామ్‌రాజ్, నల్లకుంట డివిజన్ ప్రధాన కార్యదర్శులు, సురేష్‌యాదవ్, మహేష్ తదితరులు సంతాపం ప్రకటించినట్లు సమాచారం.

పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట: డివిజన్‌లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందికి సూచించారు. గురువారం ఆమె కార్యాలయంలో ఏఎంహెచ్‌ఓ జ్యోతిబాయి, సిబ్బందితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలపై చర్చించిన కార్పొరేటర్ ప్రత్యేక కార్యాచరణతో క్లీన్ అండ్ గ్రీన్ డివిజన్‌గా తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు.

ఆకట్టుకున్న కళాప్రదర్శనలు

చిక్కడపల్లి: తెలంగాణ జాగృతి సరస్వతి అకాడమీ ఆధ్వర్యంలో త్యాగరాయగాన సభలో నిర్వహించిన కళా ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. గురువారం రాష్ట్ర మంత్రి శ్రీనివాస్‌గౌడ్ 55వ జన్మదినోత్సవ వేడుకల సందర్భంగా బంగారు తెలంగాణ ఫోక్ ఆర్ట్స్ అకాడమీ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తెలంగాణ సిటీ కల్చరల్ సంబరాల్లో చిన్నారులు శాస్త్రీయ, ఆధునిక, జానపద నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం నిర్వాహకసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విక్కీ మాస్టర్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ, డ్యాన్స్‌మాస్టర్ విష్ణుశ్వర్ పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు.

దేవస్థాన సేవా సమితి ఎన్నికల మ్యానిఫెస్టో విడుదల



అంబర్‌పేట: అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఎన్నికల్లో తమ ప్యానల్‌ను గెలిపిస్తే ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ తెలిపారు. గురువారం జైస్వాల్‌గార్డెన్‌లో ప్యానల్ మ్యానిఫెస్టోను విడుదల చేశారు. ఉపాధ్యక్షులు మన్మోహన్‌గౌడ్, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా శ్రీధర్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సంజీవచారి, కోశాధికారిగా అశోక్‌లు ఉన్నారు.